






అరసవల్లిలో ఆదిత్యుడి ఆలయాన్ని మూసివేసిన అర్చకులు



శ్రీముఖలింగంలో.. ఆలయానికి తాళం వేస్తున్న అర్చకులు



శ్రీకాకుళంలోని ఉమారుద్రకోటేశ్వరాలయంలో..



శ్రీకూర్మనాథుని ఆలయంలో..

ఆలయాలు మూత

- సంపూర్ణ చంద్ర గ్రహణం ఎఫెక్ట్

శ్రీకాకుళం కల్చరల్/ అరసవల్లి/ గార/ జలుమూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రహణం కారణంగా జిల్లాలోని వివిధ ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. ఆదివారం రాత్రి 9.56 గంటల నుంచి అర్ధరాత్రి 1.26 గంటల వరకు సంపూర్ణ చంద్రగ్రహణం సంభవించింది. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు అరసవల్లిలోని శ్రీసూర్యనారాయణస్వామి దేవాలయాన్ని మూసివేశారు. ఆదివారం ఉదయం కాస్త భక్తుల తాకిడి కనిపించింది. మధ్యాహ్నం నుంచి ఆలయ ప్రాంగణం అంతా బోసిపోయింది. ఆలయ సంప్రోక్షణ, శుద్ధి, పుణ్యాహవచనం అనంతరం సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి స్వామి దర్శనానికి భక్తులను అనుమతిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు. గ్రహణానంతరం స్వామిని దర్శించుకుని శుభాలను పొందాలని ఆకాంక్షించారు. అలాగే శ్రీకాకుళంలోని శ్రీ ఉమారుద్రకోటేశ్వర స్వామి దేవాలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు మహాభోగ నివేదన అనంతరం మూసివేశారు. సోమవారం వేకువజామున నాలుగు గంటల నుంచి స్వామి దర్శనం ప్రారంభమవుతుందని (మిగతా 8వ పేజీలో..)



సంతబొమ్మాళి: మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రైతులూ.. ఆందోళన వద్దు

- అందుబాటులోనే ఎరువులు
- 10 రోజుల్లో 3వేల మెట్రిక్ టన్నులు రాక
- మోతాదుకు మించి వినియోగించొద్దు: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సంతబొమ్మాళి/కోటబొమ్మాళి/ శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): 'ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కోసం రైతులెవరూ ఆందోళన చెందొద్దు. జిల్లాలో 1600 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉంది. మరో పది రోజుల్లో 3 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానుంద'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఆదివారం సంతబొమ్మాళి పంచాయతీ లక్ష్మీపురంలో శాస్త్రీయంగా యూరియా వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే కోటబొమ్మాళి మండలం తిలారు రైతు సేవా కేంద్రంలో రైతులతో మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'జిల్లాలో యూరియా కొరత లేదు. జిల్లాకు 21వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటికే 24వేల టన్నులు రైతుసేవా (మిగతా 7వ పేజీలో..)

జిల్లాలో పరిస్థితులపై కేంద్రమంత్రి సమీక్ష

శ్రీకాకుళం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా పంపిణీ పరిస్థితులపై కలెక్టర్‌తో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదివారం ఫోన్‌లో సమీక్షించారు. ఇప్పటివరకు జిల్లాకు వచ్చిన యూరియా నిల్వలు, రైతులకు పంపిణీ విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను కలెక్టర్ వివరించారు. త్వరలో జిల్లాకు మరో 3వేల మెట్రిక్ టన్నుల యూరియా రానున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలో యూరియా సరఫరాపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కేంద్రమంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎప్పటికప్పుడు సరిచేయాలని, సీఎం చంద్రబాబు సూచనల మేరకు రైతులు, రైతుసేవా కేంద్రాల నిర్వాహకులను సమన్వయ పరిచి పటిష్ఠంగా పంపిణీ చేయాలని తెలిపారు. యూరియా వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. 'రాష్ట్రంలో యూరియా పరిస్థితుల దృష్ట్యా కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖతో ఇప్పటికే సంప్రదించాను. కేంద్రం కూడా డిమాండ్‌కు తగ్గ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేద'ని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారులకు లేదా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

రైతు సమస్యలపై నేడు డయల్ యువర్ కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువులపై రైతుల సమస్యలను తెలుసుకునేందుకు సోమవారం 'డయల్ యువర్ కలెక్టర్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల సూచనలు, సలహాలు తీసుకోవడంతోపాటు సమస్యల తక్షణ పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. రైతులు సోమవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు 08942- 222 565 నెంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు. అలాగే రైతులకు ఎరువులపై ఎటువంటి సమస్యలున్నా, సహాయం అవసరమైనా, 9121863788 నెంబరుకు ఫోన్ చేస్తే వారికి తక్షణ సహాయం అందుతుందన్నారు. ఈ నెంబరు 24 గంటలూ అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు.

చదువుతోనే వికాసం

- నేర్చుకుంటే మంచి భవిత
- గిరిజన గ్రామాల్లో అధికంగా నిరక్షరాస్యులు
- 'ఉల్లాస్' ద్వారా శతశాతం అక్షరాస్యతకు ప్రభుత్వం చర్యలు
- నేడు అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం



వెంకటాపురం గిరిజన గ్రామంలో ఉల్లాస్ కార్యక్రమం ద్వారా చదువు నేర్పిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి):

ప్రతి ఒక్కరికీ చదువు అవసరం. మనిషి ప్రగతికి, వికాసానికి చదువు ఎంతో తోడ్పడుతుంది. సామాజిక పరిస్థితులతోపాటు జీవనస్థితిగతులను మెరుగుపరిచి ఉన్నతస్థాయిలో నిలుపుతుంది. కానీ, కుటుంబం, ఇతర ఆర్థిక పరిస్థితుల కారణంగా చాలామంది బాల్యం నుంచే విద్యకు దూరమవుతున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో కూడా కనీసం సంతకం రానివారు చాలామంది ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. వంద శాతం అక్షరాస్యత సాధించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు ప్రణాళికలు అమలు చేస్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదు. అధికంగా గిరిజన గ్రామాల్లో ఇంకా నిరక్షరాస్యులు అధికంగా కనిపిస్తున్నారు. సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా జిల్లాలో పరిస్థితిపై కథనం.

జిల్లాలో పరిస్థితి..

2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో అక్షరాస్యత 61.94 శాతంగా ఉండేది. అక్షరాస్యతపరంగా ఉమ్మడి రాష్ట్రంలో జిల్లా 10వ స్థానంలో నిలిచింది. అప్పటి సర్వే ప్రకారం 7,56,018 మంది నిరక్షరాస్యులు ఉండేవారు. వీరిని అక్షరాస్యులుగా మార్చేందుకు సాక్షరభారత్ కార్యక్రమాన్ని అప్పట్లో అధికారుల్లో అమలు చేశారు. దీనిద్వారా 5,09,950మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దారు. అయితే, 2018లో ఈ కార్యక్రమం రద్దయింది.

ఉల్లాస్ ద్వారా..

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అక్షరాస్యత పెంపునకు చర్యలు చేపడుతోంది. 2029 నాటికి శతశాతం అక్షరాస్యత లక్ష్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉల్లాస్ అనే కార్యక్రమం అమలు చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సర్వే నిర్వహించి జిల్లాలో 39,940మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించారు. వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి పది మందికి ఒక స్వచ్ఛంద వలంటీర్‌ను మహిళా సంఘాల ద్వారా ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా 11,207 వలంటీర్లను ఎంపిక చేసి రెండు విడతలుగా వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. వీరు ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7గంటల వరకు నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించారు. మొదటి విడత 18,523 మందిని అక్షరాస్యులుగా మార్చినట్లు అధికారులు తెలుపుతున్నారు. కాగా, ఉల్లాస్ పథకం జిల్లాలో అంతంత మాత్రంగానే అమలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో ఇంకా నిరక్షరాస్యత కనిపిస్తోంది. అధికంగా 30ఏళ్ల పైబడిన వారు అక్షరాలు నేర్చుకోవటానికి ముందుకు రావడం లేదు. వారిలో చైతన్య లేకపోవటమే ఇందుకు కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో గిరిజన గ్రామాలకు అధికారులు వెళ్లి వయోజన విద్యద్వారా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి చదువుపై అవగాహన కల్పించారు. దీని ద్వారా కొంతవరకు అక్షరాలు నేర్చుకోవాలనే ఆలోచన గిరిజనుల్లో ఉండేది. నేడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. మరోపక్క చదువు చెప్పే వలంటీర్లకు ఎటువంటి పారితోషికం ప్రభుత్వం ప్రకటించకపోవడంతో అక్షరాలు నేర్పించటానికి వారు ఆసక్తి చూపించడం లేదు. దీనివల్ల ఉల్లాస్ కార్యక్రమం సక్రమంగా అమలు కాని పరిస్థితి నెలకొంది.

పట్టించుకోని వైసీపీ సర్కారు..

వైసీపీ ప్రభుత్వ పాలనలో అక్షరాస్యత పెంపునకు ఎలాంటి కార్యక్రమలు అమలు కాలేదు. అక్షరాస్యత పెంపునకు కేంద్ర నుంచి అధికంగా నిధులు వచ్చినా అవి ఎక్కడ ఖర్చు చేశారో తెలియదు. 2014లో టీడీపీ ప్రభుత్వం వయోజనవిద్య, సాక్షరభారత్ వంటి కార్యక్రమాలు అమలు చేసి కొంతవరకు అక్షరాస్యత పెంపునకు కృషి చేసింది. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో చాలా గ్రామాల్లో నిరక్షరాస్యత శాతం కనిపిస్తోంది.

చైతన్యవంతం చేయాలి



చదువుపై నిరక్షరాస్యులను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉంది. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చదువు విలువను వారికి తెలియజేయాలి. గతంలో వయోజనవిద్య ద్వారా కొంత చైతన్యం తీసుకురావడంతో చాలా మంది సంతకాలు నేర్చుకున్నారు. మళ్లీ అటువంటి కార్యక్రమాలు అమలు చేస్తే మంచిది. గిరిజనులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పిస్తే వారు అక్షరాలు నేర్చుకునే వీలుంది.

- మల్లారెడ్డి పద్మనాభం, ఎంఈవో-2 మెళియాపుట్టి

శతశాతం అక్షరాస్యత లక్ష్యం

2029 నాటికి జిల్లాలో శతశాతం అక్షరాస్యత లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా 11,209 మంది వలంటీర్లను నియమించి నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పిస్తున్నాం. పర్యవేక్షణకు నలుగురు సూపర్‌వైజర్లను నియమించాం. మహిళా సంఘాల ద్వారా గిరిజనులకు అవగాహన కల్పించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం.

- బి.బాలచందర్, ఏపీవో, వయోజనవిద్య, శ్రీకాకుళం

ఎరువుల కోసం పాట్లు 7లో

'ఆరోగ్య బీమా' పేదలకు వరం
- రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

8లో కోతకు గురైన తీరం

డ్వాక్రా మహిళలకు డ్రోన్లు



- జిల్లాకు 29 మంజూరు
- 80 శాతం రాయితీపై పంపిణీకి ఏర్పాట్లు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. సంక్షేమ పథకాలతోపాటు పౌరసేవల్లోనూ వారికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఆర్థికాభివృద్ధిలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు రాయితీపై డ్రోన్లు అందజేయనున్నాయి. ఇప్పటికే చాలా గ్రామాల్లో వ్యవసాయ సాగులో భాగంగా డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. రసాయనాలు పిచికారీ చేయడంలో డ్రోన్లు వినియోగిస్తున్నారు. అటువంటివి జిల్లాలో 29 డ్రోన్లను స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇవ్వాలని నిర్ణయించారు. డీఆర్‌డీఏ అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. ఒక్కో డ్రోన్ రూ.9.80 లక్షలు కాగా.. 80శాతం రాయితీపై అందిస్తారు. అంటే లబ్ధిదారులు రూ.1.96 లక్షలు చెల్లిస్తే చాలు. ఈ నగదు కూడా బ్యాంకు రుణంగా అందిస్తుంది.

మహిళలే కీలకం..

వ్యవసాయంలో మహిళల పాత్ర కీలకం. వారు సహకారం అందిస్తేనే సాగు సాధ్యమయ్యేది. సాగులో భాగంగా రసాయనాలు, ఎరువుల పిచికారీ (మిగతా 7వ పేజీలో..)

ఏరుపాలైన ఆశలు

- ఆరేళ్లయినా పూర్తికాని ఉప్పుటేరు వంతెన
- ఉపాధి దెబ్బతింటుందని సిమెంట్ పైపులు తొలగించిన మత్స్యకారులు
- పది గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు



పైపులు తొలగించడంతో ధ్వంసమైన రహదారి

సోంపేట రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు సకాలంలో పూర్తికాకపోతే ప్రజలు నానా ఇబ్బందులు పడతారనడానికి ఉప్పుటేరు వంతెన ఓ ఉదాహరణ. సోంపేట మండలం ఎకువూరు, ఎర్రముక్కాం గ్రామాల మధ్య ఉప్పుటేరుపై వంతెన నిర్మాణ పనులు ఆరేళ్ల కిందట ప్రారంభమయ్యాయి. అప్పట్లో కాంట్రాక్టర్ ఉప్పుటేరులో సిమెంట్ పైపులు ఏర్పాటు చేసి వాటిపైన ఇసుకను కప్పి రహదారిలా మార్చాడు. దీనివల్ల పైపుల గుండా నీరు వెళ్లడంతోపాటు వాటిపైనుంచి ప్రజలు రాకపోకలు సాగించేవారు. అయితే, ఆరేళ్లవుతున్నా వంతెన పనులు పూర్తికాకపోవడంతో ఈ ఏరు ఆధారంగా బతికే గొల్లవూరు మత్స్యకారుల ఉపాధి దెబ్బతింది. సిమెంట్ పైపుల కారణంగా ఉప్పుటేరులో నీటి ఉధృతి తగ్గడంతో వారికి రొయ్యలు, చేపలు లభ్యంకాక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఎక్స్‌కవేటర్‌తో ఉప్పుటేరులో ఉన్న సిమెంట్ పైపులను తొలగించారు. దీంతో మూడు పంచాయతీల పరిధిలో ఉన్న పది గ్రామాల ప్రజలు రాకపోకలు నిలిచిపోయాయి. గత్యంతరం లేక ఉప్పుటేరులో నడుముడు లోతు నీటిలో మత్స్యకార మహిళలు రాకపోకలు సాగిస్తున్నారు. గొల్లవూరు మత్స్యకారుల చర్యను తప్పుపట్టడం కన్నా, ఈ వంతెన పనులు సకాలంలో పూర్తి చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఉప్పలాం, సిరిమామిడి, మామిడిపల్లి, గొల్లవూరు పంచాయతీల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదని కాంట్రాక్టర్ తెలిపారు. తొలగించిన సిమెంట్ పైపులను మళ్లీ ఏర్పాటు చేసి రాకపోకలకు అవకాశం కల్పించాలని ఈ ప్రాంత మత్స్యకారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



ఉప్పుటేరు నీటిలో మహిళల రాకపోకలు


ఎరుపు రంగులో..


ఎరుపు, పసుపు రంగుల్లో .


తెల్లగా, మెలమెల్లగా మబ్బుల్లో తేలియాడుతూ..

కనువిందు..!

భాద్రపద శుద్ధ పౌర్ణమి రోజున ఆదివారం చంద్రుడు కనువిందు చేశాడు. సాయం సమయాన ఎర్రని బింబమై అంతరం పసుపు, తెల్లని వర్ణంలోకి మారి వెండి వెలుగులను ప్రసరింపజేశాడు. చంద్ర గ్రహణం రోజున దోబూచులాడుతూ ఈ చిత్రాలు కెమెరాకు చిక్కాయి.

-అరసవల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి)

ఎరువుల కోసం..


ఎరువుల విక్రయ కేంద్రం వద్ద గుమిగూడిన రైతులు

అరసవల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎరువుల పంపిణీ కేంద్రాల వద్ద రైతులు పెద్ద ఎత్తున బారులు తీరారు. ఎరువులు దొరుకుతాయో లేదోనన్న ఆందోళనతో దుకాణాలవద్దకు పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. స్థానిక ఆరంగివారి వీధిలో ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం వద్ద ఇటువంటి దృశ్యం ఆదివారం కనిపించింది. రైతులు పెద్ద ఎత్తున క్యూలైన్లలో వేచి ఉండి ఎరువులను కొనుగోలు చేశారు. ఒకనొక సమయంలో తోపులాట జరిగే పరిస్థితులు కనిపించడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. అవసరానికి మించి ఇప్పటికే ఎరువుల పంపిణీ చేశామని, కావలసినంత బఫర్ నిల్వలు ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఇటువంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి.

రైతుల బారులు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎరువుల కోసం రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఆదివారం ఉదయం ఎరువుల షాపుల వద్ద యూరియా ఇస్తున్నారన్న సమాచారం రావడంతో ఆయా షాపుల వద్ద రైతులు బారులుతీరారు. దీంతో ఎరువుల దుకాణదారులు తనకు వచ్చిన యూరియా బస్తాలను రైతుకు ఎన్ని ఎకరాలు ఉన్నప్పటికీ లైన్‌లో నిలబడి ఉన్న రైతు ఒక బస్తా చొప్పున అందజేసి స్టాక్ అయిపోయిన తర్వాత షాపులు మూసివేశారు. తెల్లవారుజామునుంచి బారులుతీరారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతులకు సకాలంలో ఎరువులు అందజేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.


హరిశ్చంద్రపురం జంక్షన్‌లో ఎరువుల దుకాణం వద్ద బారులు తీరిన రైతులు

యూరియా అందక రైతుల ఆందోళన

లావేరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్ పంటలు వేసిన రైతులకు యూరియా పంపిణీ సక్రమంగా జరగలేదని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆదివారం బుడుమూరు రైతుసేవా కేంద్రం వద్ద సచివాలయ సిబ్బంది యూరియా పంపిణీ చేస్తుండగా తమకు అందుతుందో లేదోనని అని రైతులు తోపులాటలు, ఘర్షణలకు దిగారు. పోలీసులు రంగప్రవేశం చేయడంతో గొడవ సద్దుమణిగింది. రైతు సేవా కేంద్రానికి ప్రభుత్వం 130 బస్తాలు మంజూరు చేయగా ఇది ఎటూ చాలదని, రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఒక్కో రైతుకు 5 నుంచి10 బస్తాల వరకు యూరియా అవసరమని అయితే ప్రభుత్వం ఒక బస్తా ఇస్తే ఎలా అని రైతులు ప్రసాద్, హేమసుందర్, చిట్టిబాబు, గోపి, రాంబాబు తదితరులు వాపోయారు. అది కూడా 50 సెంట్ల లోపు ఉన్న రైతులకు అసలు యూరియా పంపిణీ చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అవసరం మేరకు ఎరువులను పంపిణీ చేయాలని వారు కోరారు.

యూరియా కొరత లేదు: కలెక్టర్

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కోసం రైతులెవరూ ఆందోళన చెందవద్దని, ప్రతి ఎకరాకు 3 మోతాదుల్లో ఎరువులు వినియోగించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం ఒప్పంగి గ్రామంలో ఆదివారం 'రైతులకు చేరువుగా అధికార యంత్రాంగం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క మోతాదుకి 25 కిలోల చొప్పున యూరియా 3 విడతలుగా సరఫరా చేస్తామన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని, తగినంత నిల్వలున్నాయని, జిల్లాలో ప్రస్తుతం 16 వందల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. వారం రోజుల్లో 3వేల మెట్రిక్ టన్నులు జిల్లాకు వస్తుందన్నారు. కార్యక్రమంలో జేడీఏ త్రినాథస్వామి, తహసీల్దార్ ఎం.గణపతి, ఏవో నవీన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

యూరియా కొరతలేకుండా చర్యలు: ఆర్డీవో

జి.సిగడాం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష అన్నారు. ఆదివారం పెంట గ్రామంలో రైతులతో మాట్లాడారు. రైతు సేవా కేంద్రం పరిధిలో రైతులకు ఎంతమేర యూరియా అవసరమో గుర్తించి, ఇబ్బందిలేకుండా యూరియా అందేలా చర్యలు చేపడతామన్నారు. వరి పంట పొట్టదశకు వస్తున్నందున యూరియా అవసరమని, ప్రైవేటు దుకాణాల్లో దొరక్క పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. 220 బస్తాలు యూరియా వచ్చిందని, ఇవి ఎవరికీ చాలదని అవసరం మేరకు అందించాలని కోరారు. రైతులకు ఏ మేరకు ఎరువులు అవసరమో ఇండెంట్ పెట్టాలని సిబ్బందికి ఆమె సూచించారు. ఆమె వెంట మండల ప్రత్యేకాధికారి చంద్రజీవన్, తహసీల్దార్ ఎం.సరిత, ఎంపీడీవో జి.రామకృష్ణ, ఏవో బెండు బాబ్జీ తదితరులున్నారు.

సక్రమంగా పంపిణీ చేయకుంటే చర్యలు

లావేరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు యూరియా సక్రమంగా పంపిణీ చేయక పోతే చర్యలు తప్పవని శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష స్పష్టంచేశారు. ఆదివారం వెంకటా పురంలోని రెండు ఎరువుల షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో ఎరువుల షాపుల వద్ద రైతుల సమాచారం లేకపోవడం, రైతులకు కూపన్లు కూడా అందించక పోవడంతో ఏవో మహేష్ నాయుడుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరాజు, తహసీల్దార్ శ్రీనివాసరావు, రీసర్వే డీటీ శ్రీనివాసరావు తదిరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో సాయి ప్రత్యూష

న్యూస్ బాక్స్

ఆదిత్యుని ఆదాయం రూ.1.30 లక్షలు

అరసవల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామికి ఆదివారం రూ.1,30,852 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.26,100, విరాళాలు రూ.32,907, ప్రసాదాల ద్వారా రూ.71,845 వచ్చినట్లు అధికారులు తెలిపారు. గ్రహణం కారణంగా భక్తుల రద్దీ తక్కువగా ఉన్నట్లు సమాచారం.

వైసీపీ నేతలకు మాట్లాడే హక్కు లేదు: కళా

రణస్థలం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి విషయంలో వైసీపీ నేతలకు మాట్లాడే హక్కు లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకట్రావు అన్నారు. ఆదివారం ఆయన రణస్థలం వచ్చిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చేసింది వైసీపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ఓ సీనియర్ నేతగా, బాధ్యతాయుతమైన నాయకుడిగా బొత్స సత్యనారాయణ రాష్ట్రాభివృద్ధికి సూచనలిస్తే స్వీకరిస్తామని, అయితే సీఎం చంద్రబాబును విమర్శించే హక్కు బొత్సకు లేదన్నారు.

తోటయ్యదొరకు పరామర్శ

లావేరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): లావేరు పంచాయతీ కేశవరాయుపురానికి చెందిన ఎచ్చెర్ల మాజీ ఏఎంసీ చైర్మన్ ఐ.తోటయ్యదొరను ఆదివారం ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు పరామర్శించారు. తోట య్యదొర ఇటీవల ప్రమాదవశాత్తు జారిపడి చేయి విరిగిపోయిన విషయం తెలుసుకుని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, నాయకులు నిడిగంట్ల త్రినాథ్, కోరాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'అన్నదాత పోరు'

సోంపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు పడుతున్న అవస్థలపై మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించనున్నామని వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ నిరసనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, పలువురునేతలు పాల్గొన్నారు.

వైసీపీ రైతువిభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రఘురాం

గార రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ గొండు రఘురాం వైసీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు రఘురాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, ప్రసాదరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధితురాలికి సాయం

గార రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో తల్లిదండ్రులను కోల్పోయిన కొర్ని గ్రామానికి చెందిన గుజ్జల రేవతికి ఎమ్మెల్యే గొండు శంకర్ తక్షణ సాయం కింద రూ.10 వేలను అందించారు. ఎటువంటి కష్టం వచ్చినా నేనున్నానన్న సంగతి మరిచిపోవద్దని, చక్కగా చదువుకొని మంచి ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. వాటికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తానని భరోసా కల్పించారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పేదలకు గూడు కల్పించడమే లక్ష్యం

● ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్


టిడ్కో గృహాలను పరిశీలించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పేదలకు తిండి, గూడు, గుడ్డ కల్పించడమే లక్ష్యంగా ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని, ఇదే లక్ష్యంతో ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డు జగ్గుశాస్త్రులపేట వద్ద నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను ఆదివారం పరిశీలించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో 2016-17లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 528 మంది ఇళ్ల లేని వారికి పక్కా గృహాలు మంజూరు చేసిందన్నారు. 80 శాతం పనులు పూర్తి కాగా ఆ తరువాత వైసీపీ ప్రభుత్వంలో పేదలపై కక్ష కట్టి ఇళ్ల నిర్మాణాలను అడ్డుకుందని విమర్శించారు. ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం పేదలకు పక్కా గృహాలు అందిస్తున్నట్లు నిర్మాణాలు పూర్తి చేయకుండా హడావుడిగా ప్రారంభించిందని ఎద్దేవా చేశారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ తమ్మినేని రవి, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, నాయకులు ఎస్.మురళీధర్, మొదలవలస హర్ష తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై రణభేరి

గుజరాతీపేట. సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు, ఆర్థిక పరమైన అంశాలపై ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు యూటీఎఫ్ రణభేరి జాతాను నిర్వహిస్తున్నామని, దీనిని విజయ వంతం చేయాలని ఆ సంఘం రా ష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్ కోరారు. జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభు త్వం ఏర్పాటై 15 నెలలు గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు డ్రోన్లు

(ఐదో పేజీ తరువాయి)

సమయంలో ఇబ్బందికర సమస్యలు, రుగ్మతలు ఎదురవుతున్నాయి. వీటిని పిచికారీ చేసేందుకు కూలీలు సైతం అధిక వేతనాలు అడుగుతున్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా డ్రోన్ల ద్వారా పని కానిచ్చేయవచ్చు. ఎకరా పొలంలో పది నిమిషాల్లోనే పిచికారీ పూర్తిచేయొచ్చు. డ్రోన్ల మంజూరుకుగానూ ప్రస్తుతం స్వయం సహాయక సంఘ సభ్యుల ఎంపిక జరుగుతోంది. సాధారణంగా రైతు కుటుంబాల నుంచి స్వయం సహాయక సభ్యులు ఉంటారు. అటువంటి వారికి ఈ పథకం ఎంతో ప్రయోజనం. ఎంపికైన మహిళలకు 15 రోజులపాటు శిక్షణనిస్తారు. వారి కుటుంబసభ్యుడికి మెకానిక్‌గా, మరమ్మతులకుగాను డ్రోన్ అసిస్టెంట్‌గా 5 రోజుల పాటు శిక్షణనిస్తారు.

● **ఇదీ పరిస్థితి..**

జిల్లాలో ఖరీఫ్‌లో 3.64 లక్షల ఎకరాలు, రబీలో 2 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. మొత్తం 3.56 లక్షల మంది రైతులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో స్వయం సహాయక సంఘాలు 48,256 ఉండగా.. 5,27,161 మంది సభ్యులు ఉన్నారు. ప్రస్తుతానికి 29 డ్రోన్లు మంజూరు చేశారు. ఆసక్తి, ఆదరణ చూసి మిగతా యూనిట్లు మంజూరు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జగన్ సర్కారు అప్పట్లో డ్రోన్లు అందిస్తామని హడావుడి చేసింది. కానీ డ్రోన్లను అందించలేకపోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వ్యవసాయ అవసరాలకుగాను డ్రోన్లను అందించేందుకు కసరత్తు చేస్తోంది. అది కూడా మహిళా సంఘాల సభ్యులకు అందిస్తుండడం విశేషం.

● **వినియోగించుకోవాలి..**

జిల్లాకు 29 డ్రోన్లు మంజూరయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై అందిస్తున్నాయి. ప్రస్తుతం ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. ఎంపికైన వారికి శిక్షణ కూడా ఇస్తాం. 80శాతం రాయితీపై అందిస్తున్న డ్రోన్లను స్వయం సహాయక సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి.

-కిరణ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ, శ్రీకాకుళం

ఎరువుల పంపిణీ పరిశీలన

గార, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు గార రైతు సేవా కేంద్రంలో ఎరువుల పంపిణీని ఎంపీడీవో ఈశర్ల రఘు, తహసీల్దార్ చక్రవర్తి, వ్యవసాయాధికారి డి.పద్మావతి ఆదివాకం పరిశీలించారు. రైతులకు సక్రమంగా ఎరువులు అందించాలని ఎంపీడీవో సిబ్బందికి ఆదేశించారు.

● రణస్థలం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎరువులు రైతులు పరిమితంగా వాడాలని వ్యవసాయాధికారి డి.విజయ భాస్కర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీని పరిశీలించారు. యూరియాను శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయశాఖ సూచనల మేరకు వేయాలన్నారు. వేల్పురాయి, వల్లభరావుపేట, బంటుపల్లి రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ జరుగుతోందన్నారు.

● జి.సిగడాం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.సరిత హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను ఆమె పరిశీలించారు. ఆమె వెంట వీఆర్వో సీతయ్య తదితరులున్నారు.

● ఇచ్ఛాపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పంటలకు సరైన మోతాదులో యూరియాను వాడితే ప్రయోజనాలుంటాయని ఏవో అజయ్ కుమార్ అన్నారు. ఆదివారం తులసిగాం గ్రామంలో యూరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు ప్రశ్నలు వేసి యూరియా వాడేవిధానంపై అవగాహన పొందారు.

ఆదిత్యుని దర్శించుకున్న మంత్రి కొల్లు రవీంద్ర

అరసవల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష దైవం, ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్య నారాయణ స్వామిని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఎమ్మెల్యే గొండు.శంకర్, ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ, ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు వారి పేరున ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అనివెట్టి మండపం లో అర్చకులు, పండితులు వేదాశీర్వచనం చేయగా ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని ఈవో, అర్చకులు అందించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్రకు స్వామి వారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

బెజ్జిపురాన్ని మండల కేంద్రంగా సాధిద్దాం

లావేరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో బెజ్జిపురం గ్రామాన్ని మండల కేంద్రంగా సాధి ద్దామని యూత్‌క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు, మాజీ ఎంపీపీ దన్నాన రాజినాయుడు, మాజీ జడ్పీటీసీ ప్రతినిధి పిన్నింటి మధుబాబు, అదపాక మాజీ సర్పంచ్ గొర్లె అప్పలనాయుడు, బెజ్జిపురం మాజీ సర్పంచ్ ప్రతినిధి ఇజ్జాడ శ్రీనివాసరావు తదితరులు అన్నారు. ఆదివారం అదపాక జంక్షన్ వద్ద ఏఎం సీ కార్యాలయం ఆవరణలో బెజ్జిపురం మండల కేంద్రం సాధన సమితి ఆధ్వర్యంలో 15 పంచాయతీల ప్రజాప్రతినిధులు, పెద్దలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ.. 1986లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో కొత్తగా మండల వ్యవస్థను ఏర్పాటు చేసిన సమయంలోనే ఈ ప్రాంతీయులు బెజ్జిపురం రెవెన్యూ పరిధి అదపాక జంక్షన్ సమీపంలో జాతీయ రహదారి పక్కన మండలం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విన్నవించారన్నారు. అయితే అప్పటి రాజకీయ పరిణామాల్లో సాధించుకోలేకపోయామన్నారు. ఇప్పుడు మరలా ప్రభుత్వం మండలాల పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నందున బెజ్జిపురాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు అందరూ ఐక్యంగా ముందుకు సాగుదామన్నారు. అయితే ఈ సమావేశానికి హాజరైన వారిలో బుడు మూరు నుంచి వచ్చిన వారు బుడుమూరులో మండల కేంద్రం ఏర్పాటైతే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న నేతలు, పెద్దలు

శ్రీకూర్మం జంక్షన్‌లో అంధకారం


వీధి దీపాలు లేక చీకటిలో ఉన్న శ్రీకూర్మం జంక్షన్

గార, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్రీకూర్మనాథుని క్షేత్రానికి వెళ్లే జంక్షన్ వద్ద లైట్లు లేక పోవడంతో అంధకారం నెలకొంది. క్షేత్రానికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో శ్రీకూర్మం రోడ్డు జంక్షన్ వద్ద గతంలో ఉండే వీధి దీపాలు పడిపోవడంతో మళ్లీ వాటి స్థానంలో కొత్తగా బల్బులు ఏర్పాటు చేయలేదు. దీంతో ఈ ప్రాంతమంతా చీకటిగా తయారైంది. తక్షణం తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

రైతులూ.. ఆందోళన వద్దు

(ఐదో పేజీ తరువాయి)

కేంద్రాలు, ప్రైవేటు డీలర్లు, ఇతర సొసైటీల ద్వారా పంపిణీ చేశాం. ఇంకా జిల్లాలో వెయ్యి మెట్రిక్ టన్నుల బఫర్ యూరియా నిల్వలు ఉన్నాయి. రెండు లేదా మూడు రోజుల్లో కొడైకెనాల్ నుంచి 900 మెట్రిక్ టన్నులు, వైజాగ్ పోర్టు నుంచి 1500 మెట్రిక్ టన్నులు యూరియా జిల్లాకు రానుంది. మొత్తంగా రానున్న 10 రోజుల్లో జిల్లాకు 3000 టన్నుల యూరియా అందుబాటులో ఉంటుంది. యూరియా వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలి. వరిపంటలో తగినంత మోతాదులో యూరియా వాడినప్పుడు మాత్రమే మంచి ఫలితాలు సాధిస్తాం. ఎకరాకు 25 కేజీల చొప్పున మూడు విడతలుగా వాడాలి. అంతకంటే ఎక్కువైతే చీడపీడల తాకిడి పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు.

కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, ఏడీఏ కె.జగన్మోహన్‌రావు తహసీల్దార్లు అప్పలరాజు, హేమసుందరరావు, ఎంపీడీవోలో జయంత్ ప్రసాద్, ఫణీంద్రకుమార్, డిప్యూటీ ఎంపీడీవో దుంపల శ్రీనివాస్, వ్యవసాయాధికారులు రాళ్లపాటి అప్పారావు, గోవిందరావు, పీఏసీయస్ చైర్మన్ కూచెట్టి కాంతారావు, అభ్యుదయ రైతు తంగి వెంకటరమణ పాల్గొన్నారు.

రూ.77 వేలు పలికిన గణేష్ లడ్డూ


వేలంపాటలో దక్కించుకున్న వినాయక లడ్డూతో భక్తుడు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వినాయ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో కొన్ని వీధుల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. 6వ వార్డు గిలాయి వీధి, సిందిరి వీధిలో వినాయక మండపం వద్ద వినాయక లడ్డూ వేలం వేశారు. వేలం పాటలో లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. డీఎస్‌కే యూత్ సభ్యులు గిలాయి వెంకటరావు, ఎం.ప్రసాద్, జి.సురేష్, కమిటీ సభ్యులు నిర్వహించిన వేలంలో మెండ అప్పలనాయుడు, భారతి దంపతులు లడ్డూను రూ.77 వేలకు సొంతం చేసుకున్నారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి ఫరీద్‌పేటకి వెళ్లే తారురోడ్డుపై గోతులు ఏర్పడడంతో స్థానికులు శ్రమదానం చేశారు. ఆదివారం రంగనాథ్ వాకర్స్ క్లబ్, గ్రామస్థులు తారు కలిపిన పిక్కను గుంతల్లో వేసి పూడ్చారు. ఈ సంద ర్భంగా పలువురు స్థానికులు వారిని అభినందించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

జి.సిగడాం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జాడ పంచాయతీ ముక్కుపేట గ్రామానికి చెందిన తాలాడ వెంకటరావు(40) ఆదివారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ వెంకటరావు గ్రామంలో ఒక రైతు పంట పొలంలో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ స్తంభం ఎక్కే సమయంలో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటరావుకి భార్య ఉమామహేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వై.మధుసూధనరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మహిళపై కత్తితో దాడి.. కేసు నమోదు

కొత్తూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కడుము కాలనీకి చెందిన కిల్లారి మహాలక్ష్మిపై అదే గ్రామానికి చెందని బూరాడ సంజీవరావు శనివారం రాత్రి కత్తితో దాడి చేసి గాయపరిచారని ఆమె భర్త వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎండీ అమీర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ఇంటిలో ఊడ్చిన చెత్త ఇంటి ముంగిట వేసుకుంటుంటే తన ఇంటి ఎదురుగా ఉన్న సంజీవరావు ఆమెపై దాడి చేసి గాయపరిచాడు. చికిత్సకు కొత్తూరు ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని టెక్కలి డీఎస్పీ, కొత్తూరు సీఐ సీహెచ్ ప్రసాద్, ఎస్ఐ ఎండీ అమీర్ అలీ పరిశీలించారు.

ఆత్మహత్య కేసుపై డీఎస్పీ విచారణ

ఆమదాలవలస, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చిట్టివలస గ్రామంలో ఇటీవల జరిగిన వరకట్న వేధింపులు, ఆత్మహత్య కేసుపై ఆదివారం డీఎస్పీ సీహెచ్ వివేకానంద విచారణ చేపట్టారు. నివరి సింహాచలం, పద్మ దంపతుల చిన్న కుమార్తె పూర్ణ భర్త, అత్తమామల వేధింపులు తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు కేసు నమోదు చేసిన డీఎస్పీ.. మృతురాలి తల్లిదండ్రులు సింహాచలం, పద్మలను విచారించి వివరాలను సేకరించారు. తమ కుమార్తె వివాహ సమయంలో రూ.ఐదు లక్షల నగదు, ఒక ద్విచక్ర వాహనం, 50 సెంట్లు భూమి, రూ.2 లక్షల సారె సామగ్రి ఇచ్చామన్నారు. అయితే అత్తింటివారు మరో 50 సెంట్లు భూమిని తీసుకురావాలంటూ కుమార్తెను నిత్యమూ వేధించేవారని ఆమె తెలిపినప్పటికీ పెళ్లయిన నాలుగు నెలలకే ఈ పరిస్థితి రావడంతో ఆమెకు నచ్చజెప్పి పంపించేవారమన్నారు. కొన్ని రోజులు సమయం ఇస్తే తల్లిదండ్రులకు నచ్చజెప్పి 50 సెంట్లు భూమి తీసుకొస్తానని చెప్పినప్పటికీ అల్లుడు మధుసూధనరావు తక్షణం భూమిని తీసుకురాకుంటూ విడిచిపెడతానని శారీరకంగా, మానసికంగా వేధించాడని, వాటిని తట్టుకోలేక ఆమె ఆత్మహత్య చేసుకున్నట్టు డీఎస్పీకి వారు వివరించారు. విచారణలో ఎస్ఐ సనపల బాలరాజు, సర్పంచ్ ప్రతినిధి గుజ్జల లక్ష్మణరావు, గ్రామస్థులు ఉన్నారు.

గొర్రెలు మృత్యువాతపై ఆందోళన

నందిగాం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): దీనబంధుపురం పంచాయతీ తమలాపురం గ్రామానికి చెందిన పలువురి గొర్రెలు మృత్యువాత పడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. నవరకొత్తూరు సమీపంలో ఏర్పాటు చేసుకున్న షెడ్లలో రోజూ గొర్రెలు మృతిచెందడంతో పెంపకందారులు గుమ్మడి మల్లేసు, వీరయ్య, పైల కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు, నాలుగు రోజులుగా గొర్రెలు మృత్యువాత పడుతుండడంతో జీవనభృతి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈత గొర్రెలే మరణిస్తుండడంతో పశుసంవర్ధకశాఖ అధికారులు పరిశీలించి అవసరమైన చికిత్సలు అందించాలని వారంతా కోరుతున్నారు.

వేతనాలు పెంచకుంటే సమ్మె చేస్తాం

ఆమదాలవలస, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలని, లేకుంటే సమ్మెకు సిద్ధమవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి అన్నారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు మహాసభ నిర్వహించారు. 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారని, నేటికీ కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. వెంటనే సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. ఈ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు గౌరవాధ్యక్షురాలిగా పొన్నాడ భూలక్ష్మి, అధ్యక్షురాలిగా బి.జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా పంచాది లతాదేవిలను ఎన్నుకున్నారు.

పీజీ అడ్మిషన్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో, అనుబంధ కళాశాలల్లో పీజీ అడ్మిషన్లకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి విడుదల చేసినట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ఏపీ పీజీ సెట్‌కు హాజరై అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 8 నుంచి 15 వరకు ప్రాసెసింగ్ ఫీజు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆన్‌లైన్‌లో పూర్తిచేయాలి. ప్రాసెసింగ్ ఫీజును చెల్లించిన విద్యార్థులు ఈ నెల 9 నుంచి 16 వరకు సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ నెల 12 నుంచి 17 వరకు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలి. 18న వెబ్ ఆప్షన్ల నమోదులో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. 20న సీట్లు కేటాయిస్తారు. 22 నుంచి 24 వరకు సీటు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి. 22 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. అంబేడ్కర్ వర్సిటీలో 11 ఆర్ట్స్, 5 సైన్స్ కోర్సులు ఉన్నాయ'ని ఆమె చెప్పారు.

ఐతమ్ కళాశాలకు జాతీయ స్థాయి ర్యాంక్

టెక్కలి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్‌లో 201 నుంచి 300 బాండ్ ర్యాంకింగ్‌గా మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రకటించినట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 2025కు సంబంధించి విభజించిన ర్యాంకుల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో వచ్చిన మూడు కళాశాలల్లో ఆదిత్య కళాశాల కూడా ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎనిమిది కళాశాలలు ఈ ర్యాంకింగ్‌లో ఉండగా, అందులో ఆదిత్య కళాశాల ఒకటని తెలిపారు. కళాశాలలోని నిష్ణాతులైన అధ్యాపకులు విద్యార్థులు ప్రతిభ, ఉపాధి అవకాశాలు, అధ్యాపకుల పరిశోధనలు, ఆధునిక ల్యాబ్ సదుపాయాలు ప్రాతిపదికన ఈ ర్యాంకింగ్‌లు ఎంపిక చేస్తారని తెలిపారు. దేశవ్యాప్తంగా 1,584 ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా అందులో ఉత్తమ ర్యాంకు ఆయన కళాశాలకు దక్కడంపై సంతోషంగా ఉందన్నారు. డైరెక్టర్‌తో పాటు కళాశాల ఛైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, కోశాధికారి టి.నాగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

కాశీబుగ్గ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982-83 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం 42 ఏళ్లకు తాము చదువుకున్న పాఠశాలలో ఆత్మీయంగా కలుసుకున్నారు. ఆట, పాటలతో సందడి చేశారు. తమకు చదువులు నేర్పించిన గురువులు దాశరధి, బమ్మిడి సుబ్బారావు, సూర్యనారాయణ, ఫ్రాన్సిస్, కృష్ణారావు మాస్టార్లను సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారి కేవీ గోపాల్, ఎ సత్యారావు, త్రిపాటి, సురేష్‌కుమార్, జగదీష్, హేమలత, అరుణ, ఆర్.వెంకటరమణ, కాంతారావు, అనురాధ, కామేశ్వరరావు, యోగేశ్వరరావు, గణేష్, ధాత్రి, శైలజ, వసంత తదితరులు పాల్గొన్నారు.



ఆలయాలు మూత



శ్రీకాకుళం కల్చరల్: నారాయణ తిరుమల ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు

(ఐదో పేజీ తరువాయి)

ఆలయ నిర్వాహకులు తెలిపారు. కోదండరామాలయం, నారాయణ తిరుమల ఆలయం, భీమేశ్వరాలయం, ఉమాజఠలేశ్వరాలయం, సంతోషిమాత ఆలయం, కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాలు కూడా మూసివేశారు. గార మండలం శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథ ఆలయాన్ని మధ్యాహ్నం 3.30 గంటలకు మూసివేశారు. జలుమూరు మండలం శ్రీముఖలింగంలోని మధుకేశ్వరస్వామి ఆలయంతోపాటు భీమేశ్వర, సోమేశ్వరాలయాలు కూడా మూతపడ్డాయి. సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం నుంచి ఆలయాల్లోకి భక్తులను అనుమతించనున్నారు.

- **ఇచ్ఛాపురం:** పట్టణంలోని స్వేచ్ఛావతి అమ్మవారు, పెద్ద జగన్నాథస్వామి, సత్యనారాయణ స్వామి, శివాలయాలను మూసివేశారు.
- **సోంపేట:** సోమపోలమాంబ, నింభాషిణి, దుర్గా ఆలయాలను మూసివేశారు.
- **టెక్కలి:** లక్ష్మీనరసింహస్వామి, శ్యామసుందరస్వామి, ఎండల మల్లికార్జున తదితర ఆలయాలను మూసివేశారు.
- **పలాస:** జంట పట్టణ పరిధిలోని కాశీబుగ్గ సీతారామాలయాన్ని, అన్నవరం సత్యనారాయణస్వామి, షిర్డీ సాయిబాబా, శివాలయం, లక్ష్మీగణపతి, సరస్వతి, లక్ష్మి, జగన్నాథస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలన్నీ మూతవేశారు. ఉల్లాసపేటలో వేంకటేశ్వరస్వామి, పురుషోత్తపురం కాలనీ వద్ద శివాలయం, శివాజీనగర్‌లో ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయాలు మూతబడ్డాయి.
- **పాతపట్నం:** స్థానిక నీలమణిదుర్గ ఆలయంతోపాటు కల్యాణ వేంకటేశ్వరుని ఆలయం, నీలకంఠేశ్వరుని ఆలయం, పంచలింగేశ్వరుని ఆలయాలు మూసివేసినట్టు దేవదాయశాఖ కార్యనిర్వాహణాధికారి టి.వాసుదేవరావు తెలిపారు.
- **నందిగాం:** స్థానిక ఉమాఅగస్తేశ్వర, పెంటూరు వేంకటేశ్వర, సుబ్బమ్మపేట లక్ష్మీనరసింహస్వామి, సుభద్రాపురం వెంకటేశ్వరస్వామి ఆలయాలను మూసివేశారు.
- **పలాస రూరల్:** తర్లాకోట, రెంటికోట జగన్నాథ ఆలయాలతో పాటు కాటమ్మతల్లి ఆలయాలను మూసివేశారు.



పలాస: సీతారామాలయం తలుపులు వేస్తున్న అర్చకుడు



టెక్కలి: లక్ష్మీనరసింహస్వామి ఆలయం..



పాతపట్నం: నీలమణిదుర్గ ఆలయానికి తాళాలు వేస్తున్న అర్చకులు



ఇచ్ఛాపురం: మూసివేసిన స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం



సోంపేట: సోమపోలమాంబ ఆలయం..

'ఆరోగ్య బీమా' పేదలకు వరం

- మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి/టెక్కలి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య బీమా ద్వారా పేదలకు రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించడం జరుగుతుందని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆయన ఆదివారం మండలం నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో ఆరుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.2,69,748 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలకు అన్ని విధాల మేలు చేస్తుందన్నారు.

ఏఎంసీ సభ్యులకు అభినందన

టెక్కలి ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన బగాది శేషగిరి, ఉపాధ్యక్షుడు బాడాన రమణమ్మతో పాటు పలువురు డైరెక్టర్లను మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు. వారంతా ఆదివారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రైతుల సేవల్లో ముందువరుసలో కమిటీ సభ్యులు ఉండాలన్నారు. వీరితోపాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, నాయకులు పినకాన అజయ్‌కుమార్, తర్ర రామకృష్ణ, బాలకృష్ణ, కింగ్, గండి సూర్యనారాయణ రెడ్డి, రాము, కామేసు, షన్ముఖరావు తదితరులు ఉన్నారు.



టెక్కలి ఏఎంసీ చైర్మన్, సభ్యులను అభినందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

యూరియా సక్రమంగా పంపిణీ చేయాలి

జలుమూరు (సారవకోట), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా యూరియా పంపిణీ చేయాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి మండల అధికారులను ఆదేశించారు. ధర్మలక్ష్మీపురం రైతు భరోసా కేంద్రాన్ని ఆదివారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. యూరియా ఎరువు నేరుగా రైతు భరోసా కేంద్రాలకు ప్రభుత్వం అందిస్తుందని వ్యవసాయ సహాయకులు యూరియా పంపిణీ చేసినప్పుడు అర్హులైన రైతులకు అన్యాయం జరగకుండా వన్-బీ లేదా పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా యూరియా పంపిణీ చేయాలన్నారు. యూరియా పంపిణీ ఆధార్‌కార్డు ఆధారంగా పంపిణీ జరిగితే అసలైన రైతులకు అన్యాయం జరిగి పక్కతోవ పట్టే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ అధికారులు సూచనలు మేరకు యూరియా వాడేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు విజయలక్ష్మి, వ్యవసాయశాఖ ఏడీ ఎల్వీ మధు, వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



జలుమూరు: అధికారులకు సూచనలిస్తున్న టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి

ఆందోళనవద్దు

ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై రైతులు ఆందోళన చెందాల్సి అవసరంలేదని ఎంపీడీవో పి.శ్రీనివాసరావు తెలిపారు. బొర్రంపేట, తురకపేట, యంబరాం తదితర గ్రామాల్లో ఆదివారం రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులందరికీ పూర్తిస్థాయిలో యూరియా అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి జి.తవిటినాయుడు, రెవెన్యూ కార్యదర్శి కె.జోగినాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ బి.పద్మజ, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన

హిరమండలం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాబోయే కాలంలో ఎరువులు ఏ విధంగా వాడాలి, అధికంగా ఎరువులు వాడితే జరిగే నష్టాలపై జడ్పీ సీఈవో శ్రీధరరాజా రైతులు అవగాహన కల్పించారు. ఆదివారం సుబలయ కాలనీలో ఇంటింటికి వెళ్లి ఎరువులు నిల్వలు, వాడే విధానంపై రైతులకు వివరించారు. సోమవారానికి 1500 టన్నులు అందుబాటులో ఉంటుందన్నారు. రెండు రోజుల్లో మరో 1500 టన్నులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేష్, ఎంపీడీవో కాళీప్రసాదరావు, ఏవో సంధ్య, సర్పంచ్ సుందరమ్మ తదితరులు ఉన్నారు.

రైతులతో సమావేశం

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియా సరఫరాపై రైతులు ఆందోళన చెందవద్దని తహసీల్దార్ సీతారామయ్య, ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు, వ్యవసాయాధికారి ధనుంజ అన్నారు. ఆదివారం మండలం నగరంపల్లి, రిట్టపాడు, పల్లిసారధి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. శాస్త్రవేత్తలు అభిప్రాయం ప్రకారం వరి పంటకు యూరియాను మూడువిడల్లో వేయాలన్నారు. ఎకరాకు మొదటి విడతగా 25 కిలోలు వేయాలన్నారు. ఇప్పటికే మొదటి విడత యూరియా రైతలకు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో అందిస్తాం

పాతపట్నం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతులందరికీ అవసరమైన యూరియా అందజేస్తామని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ మంచు కరుణాకరరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఏఎస్ కవిటి, ఆర్ఎల్ పురం, సీది రైతుసేవా కేంద్రాల పరిధిలో రైతులకు యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. మొదటి విడతగా 25 నుంచి 30రోజుల్లోగా, రెండ విడతగా 55 నుంచి 60రోజుల్లో, మూడో విడతగా 80నుంచి 90రోజుల్లోగా వినియోగించాన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు లండ తాతబాబు, సీది సర్పంచ్ చిన్నాల విశ్వనాథం గ్రామరైతులు నరేష్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



హిరమండలం: ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తున్న జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా



పాతపట్నం: రైతులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి కరుణాకర్

కోతకు గురైన తీరం

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా వాతావరణంలో మార్పులు కారణంగా శివసాగర్ బీచ్‌లో సముద్రతీరం కోతకు గురికావడంతో మత్స్యకారులు, పర్యటకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో సముద్రంలో ఈతరానివారు స్నానాలకు దిగద్దొని మత్స్యకారులు చెబుతున్నారు. సముద్రం అల్లకల్లోంగా ఉండడంతో అలల తీవ్రత అధికంగా ఉందని చెబుతున్నారు. సముద్రం కెరటాలు కూడా తీరం ముందుకు వస్తున్నట్టు తెలిపారు. కాగా నదులు, వాగులతో సముద్రంలో చేరిన చెత్త, చెదారం కెరటాలతో తీరానికి తీసుకురావడంతో తీరమంతా చెత్తతో నిండి ఉన్నట్టు పర్యాటకులు చెబుతున్నారు. అధికారులు స్పందించి తీరంలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



శివసాగర్ బీచ్ వద్ద కోతకు గురైన సముద్ర తీరం

వ్యాపారులు భయాందోళన చెందొద్దు

నరసన్నపేట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని.. నిర్భయంగా వ్యాపారాలు చేసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద వివిధ వ్యాపార సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రమణమూర్తికి బంగారం వ్యాపారి గుప్త హత్య నేపథ్యంలో తమ ఆందోళనను వ్యక్తం చేశారు. వ్యాపారులకు రక్షణ కల్పించేలా పోలీసులకు సూచించాలని వర్తక సంఘాల నాయకులు కోరారు. అనంతరం బంగారం వ్యాపారి గుప్త కుటంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ వాణిజ్య మండలి కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జామి వెంకటరావు, పట్టణ కళింగ వైశ్య సంఘ అధ్యక్షుడు ఉన్న వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు

అప్రమత్తంగా ఉండాలి

పాతపట్నం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని టెక్కలి డీఎస్పీ బి.లక్ష్మణరావు అన్నారు. పాతపట్నం సబ్‌జైలును ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవల కాలంలో చోడవరం సబ్‌జైలు నుంచి ముద్దాయిలు తప్పించుకొని పరారైన నేపథ్యంలో సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌జైలులో ముద్దాయిల సౌకర్యాలు వైద్య సదుపాయాలు మెనూ నిర్వాహణ, రికార్డులను పరిశీలించారు. అలాగే సిబ్బంది అందుబాటు తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. సబ్ జైలు పరిసరాలను పరిశీలించారు. సీఐ ఎన్.సన్యాసినాయుడు ఎస్ఐ బి.లావణ్య తదితరులు ఉన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ లక్ష్మణరావు

రేపు విద్యుత్ అంతరాయం

కోటబొమ్మాళి, సెప్టెంబర్ 7(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి సబ్‌స్టేషన్ పరిధిలో గల తర్లిపేట, ఊడికలపాడు, తదితర గ్రామాలకు ఈనెల 9వ తేదీన ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ నరసింహకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

కొత్తూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కంటి పరీక్షలను విద్యార్థులు తరచూ చేయించుకోవాలని కురిగాం ఆసుపత్రి ఆప్తాలమిక్ ఇప్పిలి జానకిరామయ్య సూచించారు. నేత్రదాన పక్షోత్సవాలపై ఆదివారం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు తనిఖీలు నిర్వహించిన అనంతర వ్యాచరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.రమణమ్మ, కీర్తన తదిరులు పాల్గొన్నారు.

అధికారులంతా హాజరవ్వాలి

కోటబొమ్మాళి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొత్తమ్మ తల్లి శతాబ్ది ఉత్సవాలపై సోమవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 25 వరకు జరగనున్న జరగనున్న సమావేశానికి హాజరు కావాలన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10.30లకు అన్ని శాఖల అధికారులతో సమావేశం జరుగుతుందని, అందరూ హాజరు కావాలని ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కార్యవర్గం

నరసన్నపేట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులైన యూఐసీ, వర్కు ఇన్‌స్పెక్టర్లు, డీఈవోలు సంయుక్తంగా ఆదివారం జేఏసీ కమిటీ కార్యవర్గ ఎన్నిక నిర్వహించినట్టు జేఏసీ చైర్మన్ గొల్లంగి రామకృష్ణ ఒక ప్రకటనలో చెప్పారు. గృహనిర్మాణ సంస్థలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులంతా కలిసి జేఏసీగా ఏర్పడినట్టు తెలిపారు. జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గొల్లంగి యువరాజు, ప్రధాన కార్యదర్శిగా కీర్తి అప్పలనాయుడు, ట్రెజరర్‌గా సారి సంతోష్‌తోపాటు మరో 12 మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రెగ్యులర్ ఏఈ, యూనియన్ అధ్యక్షుడిగా యు.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది.

లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రావాడ

నరసన్నపేట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటకు చెందిన శ్రీవిజయదుర్గా లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియాన్ కార్యావర్గ ఎన్నికలు ఆదివారం స్థానిక మార్కెట్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడిగా రావాడ భాస్కరరావు, ఉప అధ్యక్షుడిగా యలమంచిలి భాస్కరరావు, కార్యదర్శిగా పీస సింహాచలం, ట్రెజరర్స్‌గా జె.కొండలరావు, అచ్చుతరావు, గౌరవ అధ్యక్షుడిగా పంచిరెడ్డి మురళి, పి. బాలకృష్ణను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ తంగుడు శాంతారావు, చిన్న, చిరంజీవి, రాము, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భాగస్వామ్యం కావాలి

పాతపట్నం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని యాదవ ఉద్యోగులు సంఘ జిల్లా అధ్యక్షుడు డి.ధనుంజయరావు అన్నారు. తెంబూరు గ్రామంలో ఆ సర్లసాగర గట్టుకిరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గ్రామ యువతను అభినందించారు. అలాగే మరిన్ని మొక్కలు నాటేందుకు 22బాదం మొక్కలను గ్రామ యువత దినేష్ సాయికిరణ్‌లకు విరాళంగా ఆదివారం అందజేశారు. సంఘ నాయకులు కులవర్ధన్, పిట్ట సింహాచలం తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే ఐక్యపోరాటం

మందస, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఐక్యపోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, యూనియన్ నాయకులు హేమలత, పి.ఉమాలక్ష్మి పిలుపునిచ్చారు. మందస అన్నపూర్ణమ్మ ఆలయంలో ఆదివారం అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై వారు మాట్లాడుతూ.. కనీస వేతనం అమలు చేయాలని, టీఏ, డీఏలు మెనూ చార్జీల పెంపు వంటి సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సభ్యుల నూతన కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సభ్యులు జయమ్మ, స్వాతి, కృష్ణవేణి, నాగమణి, పుణ్యవతి, త్రివేణి పాల్గొన్నారు.